# విక్టోరియా శేషప్పయ్యర్

కె.ఆర్.కె.మోహన్

కథ

''మనకు తెలీదు కాని మనవాళ్లు చాలా గొప్పవాళ్ళు రా'' అంటూ ప్రవేశించాడు సుబ్బారాయుడు.

''అదేమిటి... మనవాళ్ళు వొట్టి వెధవాయలన్నాడు గిరీశం! అదే... గిరీశం పాత్ర ద్వారా అనిపించాడు గురజాడ. నువ్వేమో మనవాళ్ళు చ లా గొప్పవాళ్ళంటున్నావు'' అన్నాడు మధు కవ్విస్తూ.

''చాల్లే... సంతోషించాం. గురజాడ అన్నది మన తెలుగువాళ్ళని గురించి. నేను చెప్తోంది భారతీయు లందరి గురించీ'' అన్నాడు సుబ్బారాయుడు రొమ్ము విరుచుకుంటూ.

''ఆహా... జాతీయ సమస్యకి నువ్వు సజీవ ప్రతినిధివిరా. పండిట్ నెహ్రూ బ్రతికుంటే నీకు బ్రతిమాలి కనీసం పద్మశ్రీ ఇప్పించి ఉండేవాడు. అది సరే కాని ఇంతకీ సంగతేమిటి?'' అన్నాడు మధు పడక్కుర్చీ లాక్కుంటూ, సుబ్బారాయుడి ఉపన్యాసం వినడానికి సిద్ధపడుతూ.

''ఇప్పుడే హరికథకి వెళ్ళి వస్తున్నాను'' అంటూ మరో కుర్చీ లాక్కుని కూర్చోబోయాడు సుబ్బారాయుడు.

''ఉండు... ఉండు. కూర్చోకు'' అన్నాడు మధు కంగారుగా.

కూర్చోబోతున్న వాడల్లా లేచి నుంచొని ''ఏం... పడక్కుర్చీ కర్ర లాగెయ్యలేదు కదా!'' అంటూ గుడ్డని నొక్కి చూశాడు సుబ్బారాయుడు.

''కర్ర లాగెయ్యడానికి కుర్రవాళ్ళెవరూ లేరులే. నేనన్నది అందుకు కాదు. హరికథ చెప్పేవాళ్ళు కూర్చోకూడదు. నిలబడి చెప్పాలి. వీలుంటే కాళ్ళకు గజ్జెలూ, చేతిలో చిరకలూ కూడా ఉండాలి'' అన్నాడు మధు నవ్వుతూ.

''అలాగే... వెధవాయా... మెళ్ళో దండ, ముఖాన బొట్టూ అక్కర్లేదూ!'' అన్నాడు సుబ్బారాయుడు పళ్ళు బిగపెట్టి కుర్చీలో కూర్చుంటూ ''ఓ... బేషుగ్గా... అవి కూడా ఉంటే వేషం పూర్తవుతుంది'' అన్నాడు మధు చిలిపి నవ్వు నవ్వుతూ.

''అవును నాయనా... నిత్యమూ సినిమాలు చూసే నీ బోటివాళ్ళకి హరికథలకు వెళ్ళే నా వంటివాళ్ళని చూస్తే నవ్వుగానే ఉంటుంది'' అన్నాడు సుబ్బారాయుడు ముఖం ముడుచుకుంటూ.

''ఛ... ఛ... అటువంటిదేమీ లేదు. నువ్వు హరికథకి వెళ్తే నాకే... తోలు బొమ్మలాటకి వెళ్తే నాకే... నువ్వు హరికథ చెప్పబోతున్నావనుకుని సహజత్వం కోసం చెప్పాను. అంతే'' అన్నాడు మధు.

''ఛీ... నా మూడ్ అంతా పాడుచేశావు. నే చెప్పను ఫో'' అన్నాడు సుబ్బారాయుడు బుంగమూతి పెట్టి.

''అలుక మానరా... ప్రాణ సఖా... సుబ్బారాయుడితో హాస్యం ఆడకపోతే ఇంకెవరితో ఆడతాను చెప్పు... అసలు నీ పేరులోనే హాస్యం ఉంది. నీకు బిమ్మిలి, పానకం, వడపప్పు నైవేద్యం పెట్తాకాని కోపం మాని ఆ హరికథేదో త్వరగా చెప్పు నాయనా... అసలే నిద్రరాక చస్తున్నాను. నీ హరికథ వింటేనన్నా నిద్ర వస్తుందేమో'' అన్నాడు మధు బాగా కవ్విస్తూ.

''అదుగో... మళ్ళీ హరికథ అంటాడూ'' అంటూ కుర్చీలోంచి సగం లేచాడు సుబ్బారాయుడు.

''బాబోయ్... నువ్వు కొట్టేటట్టున్నావు. నువ్వు చెప్పేది ఏదో త్వరగా చెప్పు... నోరెత్తకుండా బుద్ధిగా వింటాను. నోరెత్తితే నోరెత్తకుండా నీ హరికథ విన్నంత ఒట్టు'' అన్నాడు మధు.

''అదుగో... మళ్ళీ...'' అన్నాడు సుబ్బారాయుడు.

''లేదు లేదు... పొరపాటయి పోయింది. ఇంక నోరెత్తను చూడు'' అంటూ పెదవులు బిగించి ముక్కుమీద వేలేసుకున్నాడు మధు.

మధు ఫోజు చూసేసరికి సుబ్బారాయుడికి ఫక్కున నవ్వు వచ్చింది. ''పోరా... నాకోపమంతా చల్లార్చేశావు. నిన్ను ఏ ఇల్లాలు కట్టుకుంటుందో కాని నీతో వేగలేక విడాకులిచ్చేస్తుంది'' అన్నాడు సుబ్బారాయుడు నవ్వుతూ.

''ఇంకా నయం... లేచిపోతుందన్నావు కాదు'' అని నాలుక కరుచుకున్నాడు మధు.

''అదుగో...మళ్ళీ నోరెత్తావు'' అన్నాడు సుబ్బారాయుడు చిలిపిగా చూస్తూ.

''ఇంక నోరెత్తను చెప్పు'' అన్నాడు సైగ చేశాడు మధు.

''హరికథకి వెళ్ళి వచ్చానా!'' అంటూ మొదలెట్టాడు సుబ్బారాయుడు.

మధుకి నవ్వు ఆగలేదు. మూతికి చెయ్యి అడ్డం పెట్టుకుని కుళ్ళికుళ్ళి నవ్వసాగాడు.

''ఏమిట్రా... ఆ వెధవ నవ్వు'' అన్నాడు సుబ్బారాయుడు చిరాగ్గా.

నేను నోరెత్తకూడదు అన్నట్లు సైగ చేశాడు మధు.

''ఫర్వాలేదులే... పర్మిషన్ ఇస్తున్నాను. త్వరగా చెప్పేడు''

''అమ్మయ్య... రక్షించావురా... నోరు మూసుకుని నవ్వితే ప్రాణం పోతుందేమోనని భయపడ్డాను'' అంటూ పొట్ట చేత్తో పట్టుకుని పగలబడి నవ్వాడు మధు. నవ్వినవ్వి కళ్ళంబట నీళ్ళు కారసాగాయి.

మధు వ్యవహారం చూస్తుంటే చిర్రెత్తుకొచ్చింది. ''ఒరేయ్ చెప్పేనా నవ్వు... నవ్వేనా చెప్పు... వెధవ్వేషాలు వెయ్యకు'' అంటూ చిరాకుపడ్డాడు సుబ్బారాయుడు.

అతికష్టం మీద నవ్వాపుకున్నాడు మధు.

''అది కాదురా... 'హరికథ' అనే మాట నన్ననవద్దని, అదే మాటతో నీ కథ మొదలుపెడ్తే నవ్వాగింది కాదురా'' అంటూ తిరిగ పగలబడి నవ్వసాగాడు మధు మళ్ళీ.

''చాలించు నీ బఫూన్ వేషం. నవ్వితే నవ్వావు కాని ఇంక విను. హరిదాసుగారు ఎన్ని గొప్ప విషయాలు చెప్పారనుకున్నావు. అవి వింటే నువ్వు ఇలా వెధవ్వేషాలు వెయ్యవు'' అన్నాడు సుబ్బారాయుడు సీరియస్‌గా.

మధు వస్తున్న నవ్వును ఆపుకున్నాడు.

సుబ్బారాయుడు చెప్పడం మొదలుపెట్టాడు.

''హరిదాసులు కేవలం పురాణాలూ, పిట్టకథలూ మాత్రమే చెప్తారనుకుంటున్నారు మీబోటివాళ్ళు. కాని వాళ్ళు ఎన్నెన్ని నిగూఢ రహస్యాలు చెప్తారో మీకు తెలీదు'' అంటూ ప్రారంభించాడు. మధు శ్రద్ధగా వినసాగాడు.

అది చూసి ఉత్సాహంగా చెప్పడం మొదలుపెట్టాడు సుబ్బారాయుడు.



''రామాయణంలోని ఒక చక్కని ఘట్టాన్ని, మరెవ్వరికీ తెలియని విషయాన్ని ఎంతగొప్పగా చెప్పారనుకున్నావు. హనుమంతుడు సముద్రాన్ని లంఘిస్తూ లంకవైపు వెళ్తున్నాడు. దారిలో వికట అనే ఒక మహారాక్షసి ఆంజనేయుని అడ్డగించింది. అయితే ఆయనకి ఒక ధర్మసంకటం కలిగింది - స్త్రీతో యుద్ధం చేయడం ఉచితమా - అనుచితమా అని. యుద్ధం చేస్తే అది తప్పిదం అవుతుంది. చేయకుంటే తను ముందుకు వెళ్ళలేడు. కొంతసేపు ఈ విషయాన్ని బాగా ఆలోచించి, రాముని స్మరించి 'వికట' రాక్షస స్త్రీ కనుక మానవ ధర్మాలు పాటించనవసరం లేదనీ, కనుక ఆమెతో యుద్ధం చేయడం తప్పుకాదు అనీ నిర్ణయించుకొని ఆమెతో యుద్ధంచేసి ఓడించాడు'' అని కొంచెం ఆపాడు సుబ్బారాయుడు.

''ఇందులో కొత్తేమి ఉందీ. ఇది అందరికీ తెలిసిన కథేగా'' అన్నాడు మధు.

''ఆ... అక్కడే ఉంది విశేషం. అందరికీ తెలిసింది అంతవరకే. ఆ తర్వాతి సంగతి చెప్పింది ఈ హరిదాసు గారొక్కరే'' అన్నాడు సుబ్బారాయుడు ఉత్సాహంగా.

''ఏమిట్రా ఆ రహస్యం?'' అంటూ ఆసక్తికనబర్చాడు మధు.

''నిజమే. అది చిదంబర రహస్యమే. ఓడిపోయిన వికట ఏం చేసిందటా? ఆంజనేయుల వారిని శరణు వేడిందట. అప్పుడు ఆయన కరుణించి, ఆమెను క్షమించి ఏదైనా వరం కోరుకోమన్నాడట'' అన్నాడు సుబ్బారాయుడు - అరమోడ్పు కన్నులతో తానే ఆంజనేయులుగా అభినయిస్తూ.

''అప్పుడేమైంది?'' అన్నాడు మధు నిజమైన ఆసక్తితో.

''వికట తాను మహారాణి కావాలని కోరుకుందట. అందుకు హనుమంతుడు 'అమ్మా... వికటా... నీ కోరిక ఈ జన్మలో తీరదు. కలియుగంలో నువ్వు రవి అస్తమించని సామ్రాజ్యానికి మహారాణి వవుతావు' అని వరం అనుగ్రహించాడట'' అని ఆపాడు సుబ్బారాయుడు.

''ఆ చెప్పేదేమో త్వరగా చెప్పు. మధ్య సస్పెన్స్ ఎందుకు?'' అన్నాడు మధు.

''అదేం లేదు... నువ్వు శ్రద్ధగా వింటున్నావో లేదోనని ఆపాను. అంతే. ఆ... ఆ విధంగా వరం పొందిన వికటే 'విక్టోరియా' మహారాణిగా పుట్టి మన దేశంతోపాటు రవి అస్తమించని సామ్రాజ్యాన్ని ఏలిందట'' అన్నాడు సుబ్బారాయుడు చిక్కుముడి విడదీసినట్లు.

మధు వస్తున్న నవ్వుని ఆపుకుని సీరియస్‌గా ''మరి ఎవరికీ తెలీని ఈ రహస్యం మీ హరిదాసుగారికి ఎలా తెలిసిందో'' అన్నాడు.

''ఆయన మాటలు సందేహించకు. ఆయన హనుమదుపాసకుడు. సాక్షాత్తూ ఆంజనేయ స్వామే చెప్పినా చెప్పి ఉండవచ్చు. ఈ మాట నిజమేనని అనుకోవచ్చు. ఎందుకంటే 'వికటే' 'విక్టోరియా' అనే పదాలలో ఎంతటి పోలికుందో చూడు'' అన్నాడు సుబ్బారాయుడు.

''అంతా బాగానే ఉంది. కాని నాకు ఒక్కటే బాధగా ఉందిరా'' అన్నాడు మధు.

''ఏమిట్రా అది?'' అన్నాడు సుబ్బారాయుడు ఆశ్చర్యంగా.

''మీ హరిదాసుగారికి తెలిసిన ఈ రహస్యం పాపం ఆ విక్టోరియా మహారాణికి తెలియకపోయిందే అని. ఈ విషయం ఎరిగి ఉంటే ఆమె బేషరతుగా మన దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చి ఉండేది'' అన్నాడు మధు వ్యంగ్యంగా.

మధు వెక్కిరింపును నిజంగానే తీసుకున్నాడు సుబ్బారాయుడు.

''ఎంతో పుణ్యం చేసుకుంటేనేకాని పూర్వజన్మ జ్ఞానం కలుగదు. పైగా ఆమె పూర్వజన్మను నమ్మని మ్లేచ్ఛజాతిలో పుట్టింది. అందువల్ల తెలిస్తే మాత్రం నమ్ముతుందా? నమ్మినా నమ్మకపోయినా ఆంజనేయుల వారి అనుగ్రహం ఉంది కనుక మహారాణిగా పుట్టింది'' అన్నాడు.

''ఒరేయ్... నువ్వు కూడా ఆంజనేయుల వారిని నమ్ముకో. నీకు కూడా వచ్చే జన్మలో మహారాజయోగం పడ్తుంది. కనీసం రాణిగారి భర్తగానైనా పుట్తావు'' అన్నాడు మధు నవ్వుతూ.

''వెధవా... బుద్ధిగా విన్నట్లే విని, మళ్ళీ మొదలుపెట్టావు!'' అన్నాడు సుబ్బారాయుడు కోపంగా.

''అబ్బెబ్బే... అదేం లేదు. నిజంగానే చెప్పాను. అది సరే. నువ్వు నాకో మంచి కథ చెప్పినప్పుడు నేను మాత్రం నీకు అంతకన్నా మంచి కథ చెప్పొద్దు!'' అన్నాడు మధు.

''ఏమిట్రా అది?'' అన్నాడు సుబ్బారాయుడు ఉత్సాహంగా.

''ఇది త్రేతాయుగం నాటి కథ కాదు. ఈ కలియుగంలోనిదే. పురాణం కాదు - చరిత్ర. పైగా ఇది మనందరికీ తెలిసిన ఆయన కథ'' అన్నాడు మధు ఊరిస్తూ.

''ఎవర్రా ఆ వ్యక్తి?'' అన్నాడు సుబ్బారాయుడు ఆశ్చర్యంగా.

''మాకు ఒక హిస్టరీ లెక్చరర్ ఉండేవాడు. చరిత్ర గురించీ, చారిత్రక పురుషుల గురించీ ఎన్నో పరిశోధనలు చేసి ఆయన అనేక రహస్యాలు బయటపెట్టాడు. అయితే దురదృష్టవశాత్తూ ఆయన కృషికి గుర్తింపు రాలేదు. ఆయన పరిశోధించి చెప్పిన విషయమే నేను ఇప్పుడు చెప్తోంది'' అని ఆపాడు మధు.

''అదేదో త్వరగా చెప్పరా'' అన్నాడు సుబ్బారాయుడు కుతూహలం ఆపుకోలేక.

''చెప్తున్నాను. తొందరపడకు. అది సరేకాని షేక్స్పియర్ ఎవరు?''

''మహాకవి. ఇది అందరికీ తెలిసిందేగా''

''అది సరే... ఆయన ఏ దేశంవాడు?''

''ఇంగ్లీష్‌వాడు''

''అని అందరిలాగా మనమూ అనుకుంటున్నాం''

''మరి?''

''ఆయన సాక్షాత్తు భారతీయుడు. అందులోనూ అరవవాడు''

''నిజంగా! మరి ఈ విషయం ఎవరికీ తెలియదే!''

''ఎలా తెలుస్తుంది? ఆయన భారతీయుడంటే ఇంగ్లీష్ వాళ్ళకి నామోషీ కదా? మా మాష్టారు చెప్పడంవల్ల నాకు తెలిసింది. షేక్స్పియర్ తాత 'శేషప్పయ్యర్'. ఆయన ఇంగ్లండ్‌కి వలస పోయాడు. అక్కడికి వాళ్ళకి నోరు తిరక్క ఆయన్ని 'షేక్స్పియర్' చేశారు. ఆయన పేరే మనవడికి పెట్టారు. ఆయనే షేక్స్పియర్''

''ఎంత విచిత్రం!'' అని ఆశ్చర్యంగా ముక్కుమీద వేలేసుకున్నాడు సుబ్బారాయుడు.

''నీ ముఖం. అందుకే నిన్ను సుబ్బారాయుడు అన్నారు. మీ వాళ్ళు కూడా నీకు తగిన పేరు పెట్టారు'' అన్నాడు మధు.

సుబ్బారాయుడు నోరెళ్లబెట్టాడు.

''అవునురా...మన వాళ్లలో నీలాంటి సుబ్బారాయుళ్ళు చాలామంది ఉన్నారు. వాళ్ళు కాలక్షేపానికి చెప్పినా, స్వంత పైత్యంతో చెప్పినా, ఆ కాకమ్మ పిచికమ్మ కబుర్లను నమ్మేసి ప్రచారం చేస్తుంటారు. దీని మూలంగా మన పురాణాలు, చరిత్ర, సాహిత్యం అన్నీ కూడా మూఢనమ్మకాలూ, సంప్రదాయాలతో ముడిపడి ఏది ఏమిటో తెలియని పరిస్థితి ఏర్పడింది. మన సంస్కృతి పట్ల మనకి గౌరవం ఉండవలసిందే. కాదనను కాని ప్రతి విషయంలోనూ మనమే గొప్పవాళ్ళమనుకుని ఆ గొప్పతనాన్ని కేవలం గతంలో చూసుకుని మురిసిపోతూ ఉంటే మనకి వర్తమానమే కదా - భవిష్యత్తు కూడా అంధకారమై పోతుంది. నువ్వు చదువుకున్నవాడివి. నీలాంటి వాళ్ళు కూడా ఇటువంటి కాకమ్మ కథలని గొప్ప సత్యాలుగా ప్రచారం చేస్తే అంతగా మించిన ఆత్మవంచన వేరే ఉండదు. మన వాళ్ళు మూర్ఖత్వంలో పడిపోవడమే కాకుండా మన జాతి యావత్తూ నలుగురిలో నవ్వుల పాలు అవుతుంది. ఈ పిట్టకథలని విని హాయిగా నవ్వుకోవాలే కాని నిజంగా తీసుకోకూడదు'' అంటూ ఒక్కుమ్మడిగా ఉపన్యాసాన్ని దంచాడు. ''నాయనా ఆపు. మద్దెల వాయించినట్లు, రోకలితో దంచినట్లు నన్ను నుగ్గునుగ్గు చేసి వదిలిపెట్టావు. అయితే అయింది కాని నాకు జ్ఞానోదయం కలిగించావు. ఇంకెప్పుడూ ఇలా వాగను'' అన్నాడు సుబ్బారాయుడు బుర్ర తడుముకుంటూ.

''అదే... నాకు కావలసింది పద. అలా బయటికిపోయి చల్లని ఐస్‌క్రీం తిని వద్దాం''

''అంతకన్నానా! ఇప్పుడు నాకు కావలసింది చల్లదనం'' అన్నాడు సుబ్బారాయుడు.

ఇద్దరూ నవ్వుకుంటూ బయటకు వెళ్ళారు.

★